



AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ ధర్నా



అక్షరటుడే, కామారెడ్డి: ఓటు హక్కు పరిరక్షణ కోసం రేపు కామారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని వివరించారు. ధర్నాలో భాగంగా సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేస్తామన్నారు. ఈ ధర్నాకు వచ్చే ప్రతి ఒక్కరూ నల్ల చొక్కాలు ధరించి రావాలని కోరారు.



తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని.. ఆయన సేవలను మరువలేమని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. నగరంలోని హనుమాన్ జంక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి అడిషనల్ కలెక్టర్ భుజంగరావుతో కలిసి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరోదత్తుడు అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి తన జీవితాన్ని అంకితం చేసిన బాపూజీ ఆదర్శాలను అనుసరించి యువత సమాజ సేవ చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూరగాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సీతక్క స్పందిస్తారా..?



- గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానం
- బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఎదురుచూపులు
- నత్త నడకన సాగుతున్న యూజీడీ పనులు
- కాళేశ్వరం పనులకు నిధులు కరువు
- రేపు మూడు ఉమ్మడి జిల్లాల అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సమస్యలు తాండవిస్తున్నాయి. పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఆచరణకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమైన సమస్యల పరిష్కారంలో చొరవ చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో రేపు మంత్రి సీతక్క నిర్వహించే సమీక్షలోనైనా వీటికి పరిష్కారం లభిస్తుందా అన్న చర్చ జోరుగా సాగుతోంది.

– అక్షరటుడే, కామారెడ్డి

పరిష్కారం లభించేనా..?

ఉమ్మడి జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అత్యవసర పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేపు జరిగే సమీక్షలో మంత్రి సీతక్క ఈ సమస్యలపై ఎలా స్పందిస్తారు? పెండింగ్ బిల్లుల విడుదలకు, రోడ్లు, యూజీడీ, కాళేశ్వరం పనులకు నిధులు మంజూరు చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన అధికారులతో సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమీక్ష చేపట్టనున్నారు. ఈ సమావేశానికి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ సమీక్షలో ఏ అంశాలపై చర్చిస్తారు..? ఎన్ని అంశాలకు ఆమోద ముద్ర వేస్తారనేది తెలియాల్సి ఉంది.

గ్రామాల్లో అంతర్గత రహదారులు..

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా గ్రామాల అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. సీసీ రోడ్లు గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. ప్రధాన రహదారులు సైతం గుంతలమయంగా మారాయి. పలు చోట్ల బ్రిడ్జిల నిర్మాణ పనులు నిధులు మంజూరు కాక మధ్యలోనే నిలిచిపోయాయి. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల కోసం మాజీ సర్పంచులు..

గత ప్రభుత్వ హయాంలో మాజీ సర్పంచులు సొంత డబ్బులు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లులు కోట్లాది రూపాయలు పెండింగ్ లో ఉన్నాయి. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే సుమారు రూ.9 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. 15 రోజుల క్రితమే ప్రభుత్వం జిల్లాల వారీగా పెండింగ్ బిల్లుల వివరాలు సేకరించింది. అయినా ఇప్పటి వరకు విడుదల కాలేదు.

ఫైనల్ బిల్లులపై సందిగ్ధం

ఇందిరమ్మ ఇళ్ల పురోగతిలో ఉమ్మడి జిల్లా ముందంజలో ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తుండటంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

నత్తనడకన సాగుతున్న యూజీడీ పనులు

నిజామాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. తవ్విన రోడ్లు అలాగే పదిలేయడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో అసలు యూజీడీ వ్యవస్థే లేదు. దీంతో వర్షం పడితే మురుగు నీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. ఇక అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. కొత్తగా అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

22 ప్యాకేజీకి నిధులు మంజూరయ్యేనా..?

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాణహితచేవెళ్ల (కాళేశ్వరం 21, 22 ప్యాకేజీ) పనులు పూర్తిగా అటకెక్కాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.1400 కోట్ల వ్యయంతో ఈ పథకానికి ఇక్కడే శ్రీకారం చుట్టారు. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్ మార్చింది. కాలువలు తవ్వి వదిలేయడంతో నిధులు లేక పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం పచ్చాక కేవలం రూ.23 కోట్లు మాత్రమే మంజూరు చేసి చేతులు దులుపుకుందన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు బోరుబావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వన మహోత్సవంలో కామారెడ్డి జిల్లాకు 5వ స్థానం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: వన మహోత్సవ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో ఈ ఏడాది మొత్తం 24.67 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, సెప్టెంబర్ నాటికి 22.55 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. దీంతో జిల్లాలో 91.46 శాతం లక్ష్యం పూర్తయింది. వన మహోత్సవంలో పలు శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాయి. ఐసీడీఎస్ శాఖ 197.08 శాతం, జిల్లా సహకార శాఖ 169.80 శాతం, ఆర్‌డబ్ల్యూఎస్ 150 శాతం, గ్రామీణాభివృద్ధి శాఖ 130.23 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాయి. ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ 118 శాతం, మైనార్టీ వెల్ఫేర్ శాఖ 105 శాతం లక్ష్యాన్ని సాధించాయి. అదేవిధంగా ఫిషరీస్, మైన్స్ అండ్ జియాలజీ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్/ఐటీడీఏ, సివిల్ సప్లై శాఖలు 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాయి. హార్టికల్చర్/సెరికల్చర్ శాఖ 91.82 శాతం, ఇండస్ట్రీస్ 90 శాతం, మున్సిపల్ అధారిటీస్ 70.38 శాతం, అగ్రికల్చర్ 58.12 శాతం, ఫారెస్ట్ 55.33 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాయి. రెవెన్యూ శాఖ 50 శాతం, ఎక్సైజ్ 38.08 శాతం, విద్యుత్ శాఖ 7.86 శాతం లక్ష్యాన్ని సాధించాయి. రవాణా, ఆర్టీసీ, పోలీస్ తదితర కొన్ని శాఖల్లో ఇంకా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కాలేదని అధికారులు పేర్కొన్నారు.



గణేష్ నిమజ్జనోత్సవానికి సహకరించిందుకు కృతజ్ఞతలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: గణేష్ నిమజ్జనోత్సవానికి సహకరించిన ప్రతిఒక్కరికి సీపీ సాయిచైతన్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కమిషనరేటు పరిధిలో 5,811 గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు సీపీ తెలిపారు. నిమజ్జనం కోసం ప్రత్యేకంగా బాసర బ్రిడ్జి వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేశామని.. బాసర, ఉమ్మెడ ఇవి కాకుండా మిగితా చాలా ప్రదేశాలలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ప్రత్యేకంగా రెవెన్యూ శాఖ, జీపీలు, మున్సిపాలిటీలు, అబ్కారీ శాఖ, ఫైర్ సర్వీస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, గజ ఈతగాళ్లు అందరూ వారి సేవలను అందించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పేర్కొన్నారు.

యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దు



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని అడిషనల్ కలెక్టర్ భుజంగ రావు పేర్కొన్నారు. నశాముక్త సేవ్‌భారత్ 100 ఆదివారాల కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మేరా యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో 'నా ఆరోగ్యమే నా గర్వకారణం' పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భుజంగరావు సంతకాల సేకరణ ప్రారంభించి అనంతరం మాట్లాడారు. విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమానికి హాజరైన 127 మంది విద్యార్థులకు రక్త, బీపీ, షుగర్, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి ఉచితంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మానసిక సమస్యలు ఉన్నవారు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416 కు కాల్ చేసి సైకియాట్రిస్ట్ సలహాలు పొందవచ్చని డీఎంహెచ్‌వో రాజశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రాములు, మేరా యువభారత్ జిల్లా అధికారి రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సికందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆదర్శంగా నిలవాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా గుర్తింపు పొందాలనని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని న్యాలకల్ రోడ్డులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఐటీఐ గ్రౌండ్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. వాకింగ్ గ్రూప్ రాజకీయం వైపు పోకుండా ఐక మత్యంగా ఉంటూ సమాజ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు, డీసీసీ డెలిగేట్ భక్తవత్సలం నాయుడు, కార్పొరేటర్లు, జగదీష్ కులకర్ణి, మురళి, శ్రవణ్ రమేష్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండల పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మోహన్ గైక్వాడ్, కోశాధికారి సీతారాములు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



'ఎస్ఐఆర్'కు స్పందించకపోవడంతోనే పీసీసీ చీఫ్‌కు నోటీస్ : ఎంపీ అర్వింద్







అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: 'ఎస్ఐఆర్'కు స్పందించకపోవడంతోనే పీసీసీ చీఫ్‌కు నోటీస్ ఇచ్చారని ఎంపీ అర్వింద్ అన్నారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఓట్ చోరీ కాదు రాహుల్ గాంధీ అఖిల్ చోరీ జరుగుతోందని ఎంపీ అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌లో అభిప్రాయ బేధాలు ఉండడం సహజమని ఎంపీ అన్నారు. చివరికి నిర్ణయం చీఫ్ కమిషనర్‌దేనన్నారు. రాజ్యాంగ బద్ధంగా నిర్ణయాలు జరుగుతూనే ఉంటాయని.. గాంధీ కుటుంబానికి ఇవన్నీ అర్థం కావన్నారు. ప్రజాస్వామ్య విధానాలు పాటించకనే కాంగ్రెస్ పార్టీ దేశంలో చీలిపోయిందని పేర్కొన్నారు. సీఈసీని అత్యధికంగా వాడుకుంది కాంగ్రెస్ పార్టీనేనని ఆరోపించారు. దేశంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కడా గెలిచే పరిస్థితి లేదని విమర్శించారు. రాహుల్ గాంధీని చూస్తే ఎవరు ఓటెయ్యరన్నారు. అందుకే ఫ్రస్టేషన్‌లో రోడ్డెక్కుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశద్రోహ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. 'సర్' ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ఎన్‌రోల్‌మెంట్ కోసం వచ్చినపుడు మహేష్ గౌడ్ స్పందించలేదని ఎంపీ అన్నారు. అందుకే ఆయనకు నోటీసు జారీ అయిందని వివరించారు. ఆయన నిజామాబాద్ ఓటరే.. కావాలంటేతాను ఎన్‌రోల్‌మెంట్ చేయిస్తాయని పేర్కొన్నారు. రోహింగ్యాలకు, బంగ్లాదేశీయులకు ఇక్కడ ఎన్‌రోల్‌మెంట్ జరగదని ఎంపీ అర్వింద్ అన్నారు.

హామీలను నెరవేర్చాలి

అక్షరటుడే, బోధన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. బోధన్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రజలను ఘోరంగా మోసం చేసిందని ఆగ్రహించారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ సైకిల్ యాత్రలో నిజమాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
ఆదివారం
27.9.2026

www.aksharatodaynews.com
AKSHARA TODAY

‘అమ్మకు అక్షరమాల’తో మహిళల్లో అక్షరజ్ఞానంపై ఆసక్తి



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ‘అమ్మకు అక్షరమాల’ కార్యక్రమం ద్వారా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహించిన మలి విడత పరీక్షలకు జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభించింది. మొత్తం 520 పరీక్షా కేంద్రాల్లో 15,635 మంది మహిళలు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. ఎల్లారెడ్డి మండలంలో 24 కేంద్రాలు ఎల్లారెడ్డి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 650 మంది మహిళలు ఉల్లాస్ అక్షరాస్యత పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారు. తిమ్మారెడ్డి, అజామాబాద్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా డీపీఎం శ్రీనివాస్, జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ శుభం సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఐకేపీ డీపీఎం, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ సమాఖ్యల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పరీక్ష నిర్వాహకులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలో ఏపీఎం రామనారాయణ గౌడ్, సీసీలు రమేష్ గౌడ్, గోపాల్, వీఓఏలు, వీవో అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పరీక్షల నిర్వహణలో సహకరించారు.

విద్యారంగ సమస్యలపై మంత్రి సమీక్షించాలి



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాకు రానున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క సమీక్షలో విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ అన్నారు.జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1000 మందికి పైగా విద్యార్థులు చదువుతుండగా కేవలం 10 తరగతి గదులు మాత్రమే ఉన్నాయని, తరగతి గదులు, బెంచీలు, డెస్కులు, ఇతర మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సేన అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని తెలిపారు. అదేవిధంగా ఏటీసీ, ఐటీఐ కళాశాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని, అందుకు అవసర మైన భూమిని కామారెడ్డి పట్టణంలోనే కేటాయించి జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

డిచ్‌పల్లి మండలంలో మాంసం విక్రయాలకు సంబంధించి విక్రయ దారులు నిబంధనలు పాటించట్లేదు. ఇష్టారీతిన మేకలు, గొర్రెలను వధిస్తున్నారు. పరిశుభ్రత పాటించడం లేదు. - అక్షరటుడే, డిచ్‌పల్లి



ముక్క మంచిదేనా..?

■ అడ్డగోలుగా మాంసం విక్రయాలు ■ రోగాల నిలయాలుగా మాంసం విక్రయ కేంద్రాలు ■ చచ్చిన జీవాల మాంసాన్ని అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం

మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ డిచ్‌పల్లి సమీపంలోని నాగ్‌పూర్ గేట్ మీదుగా లారీల్లో వందలాది మేకలు, గొర్రెలను రవాణా చేస్తున్నారు. రవాణా సదుపాయాలు సరిగా లేక, వాహనాల్లో పరిమితికి మించి జీవాలను తీసుకొస్తుంటారు. దీంతో మూగజీవాలు మార్గమధ్యలోనే ఊపిరాడక ప్రాణాలు కోల్పోతున్నాయి.

పూడ్చిపెట్టాల్సింది పోయి..

నిజానికి చనిపోయిన పశువుల కళేబరాలను పూడ్చిపెట్టాలి. కానీ డిచ్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని కొందరు స్వార్థపరులైన మాంసం వ్యాపారులు ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రవాణాలో చనిపోయిన, కుళ్లిపోయిన, వ్యాధుల బారిన పడి మరణించిన జీవాలను అత్యంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రాత్రికి రాత్రే వాటిని రహస్య ప్రాంతాలలో కోసి, రసాయనాలు కలిపి తాజా మాంసంగా భ్రమపడేలా మార్చి మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్రమాదాల్లో చనిపోయిన జీవాల మాంసాన్ని కూడా ఎలాంటి తనిఖీలు లేకుండా ప్రజలకు విక్రయిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

చట్టాలు ఉన్నా..

మాంసం విక్రయ రంగానికి సంబంధించి ప్రభుత్వ చట్టాలు ఉన్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన వధశాలల్లో.. లైసెన్స్ ఉన్న కేంద్రాల్లో మాత్రమే జీవాలను కోయాలి. ముఖ్యంగా ఈ ప్రక్రియ అంతా అర్హత కలిగిన పశువైద్యాధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే జరగాలి. జీవాలను కోయడానికి కనీసం 12 నుండి 24 గంటల ముందు పశువైద్యుడు వాటిని పరీక్షించాలి.

జీవాన్ని కోసిన వెంటనే దానికి సంబంధించిన కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, పేగులు మరియు మాంసాన్ని పశువైద్యుడు క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. అన్ని చూశాకే అధికారిక ముద్ర వేయాలి.. కాని ఇవన్నీ డిచ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో జరగట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇష్టారీతిన మేకలు, గొర్రెలను వధిస్తున్నారు.

కనీస జాగ్రత్తలు కరువు

డిచ్‌పల్లిలో మాంసం కేంద్ర నిర్వాహకులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువై ఈగలు, దోమలు, బ్యాక్టీరియా వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఈ కాలంలో కలుషిత మాంసం తింటే టైఫాయిడ్, కలరా, డయేరియా, ఫుడ్ పాయిజనింగ్, జీర్ణకోశ వ్యాధులు వ్యాపిస్తాయి. వ్యాధిగ్రస్తులైన జీవాల మాంసం తింటే 'జూనోటిక్' వ్యాధులు మానవులకు సంక్రమించే ప్రమాదం ఉంది. మాంసం కడగడానికి కేవలం సురక్షితమైన తాగునీటిని మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా మురికినీళ్లలోనే మాంసాన్ని కడిగి ప్రజలకు విక్రయిం చేస్తున్నారు.

పర్యవేక్షణ అవసరం..

నాగ్‌పూర్ గేటు, డిచ్‌పల్లి పరిసరాల్లో చచ్చిన జీవాలను కోసే రహస్య స్థావరాలను గుర్తించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఆహార భద్రతాధికారులు, పశుసంవర్ధక శాఖ, నడ్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే రంగంలోకి దిగి నాగ్‌పూర్ గేటు, డిచ్‌పల్లి, నడిపల్లి ప్రాంతాల్లో సమగ్ర విచారణ జరిపి, అక్రమ మాంసం దందాను అరికట్టాలి. ప్రజారోగ్యంతో ఆడుకుంటున్న నిర్వాహకులపై పీపీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారులు..!

నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని డిచ్‌పల్లి స్టేషన్‌లో మాంసం కేంద్రాల్లో విక్రయించే జీవాలను పశువైద్యాధికారి సమక్షంలో పదించడం లేదు. అయినా పంచాయతీ అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అనేక మాంసం దుకాణాలు నడుస్తున్నాయి. ప్రతి మాంసం దుకాణానికి పంచాయతీ అనుబంధ లైసెన్స్ తనిఖీ చేయాలి. లైసెన్స్ లేని దుకాణాలను తక్షణమే సీల్ చేయాలి. కానీ ఇవేమి జరుగుతున్నట్లుగా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే..



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు నగరంలోని సీపీఐ జిల్లా కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆర్ఎస్పీ, ఎంసీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, కటారి రాములు, వై ఓమయ్య, అలీ ఇమ్రాన్, కే శ్రీనివాస్, ఖాజా మోహినుద్దీన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అక్షరటుడే, బాల్కొండ : మండలంలోని పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాల్కొండ, వన్నెల్ (బి), చిట్టాపూర్, కిసాన్‌నగర్, బోదేపల్లి, శ్రీరాంపూర్, బాసాపూర్, జలాల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు రూ.14,27,500 చెక్కులు మంజూరయ్యాయి. వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం కోరిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఈ నిధులు కుటుంబాలకు ఆర్థికంగా ఉపయోగపడనున్నాయని కాంగ్రెస్ పేర్కొన్నారు.

‘చలో అమరావతి’కి సిద్ధంగా ఉండాలి



అక్షరటుడే, డిచ్‌పల్లి: అమరావతిలో వచ్చేనెల 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ జాతీయ సదస్సుకు డిచ్‌పల్లి మండల కమిటీ సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు డిచ్‌పల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ మండల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాలతో తెలంగాణలో అన్ని మండలాల నూతన నాయకులు అమరావతికి తరలిరావాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి డప్పు నర్సయ్య కోరారు.

నలభై ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిశారు

అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సందడి నెలకొంది. 1982-85 బ్యాచ్‌నకు చెందిన ఫిషరీస్, ఫారెస్ట్ కోర్సుల పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్నారు. మినీ అల్యూమినీ పేరుతో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కళాశాల రోజుల ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్ కు చెందిన విద్యార్థులు ప్రస్తుతం పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, వ్యాపార, ఐటీ రంగాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. మరికొందరు ఉద్యోగ విరమణ పొందగా, పలువురు విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, సైంటిస్టు పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న కళాశాలలో కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందించి, కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.



ముప్కాల్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



అక్షరటుడే, ముప్కాల్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ముప్కాల్ పద్మశాలి సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మొదటి పంత అధ్యక్షుడు లక్ష్మీరాజాం, మూడో పంత అధ్యక్షుడు చిలుక సుదర్శన్, పద్మశాలి జిల్లా కార్యవర్గ సభ్యులు గురుడు దయానంద్, మాజీ ఎంపీటీసీలు చిలుక గోపాల్, గంగాధర్, జక్కుల జీవన్, ఉప సర్పంచ్ బ్రహ్మదండి చిన్నయ్య, చాట్ల వెంకటరమణ, మ్యాక శివకుమార్, మ్యాక నర్సయ్యతో పాటు పద్మశాలి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలి



అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత గాథను భారతదేశంలోని ప్రతి పాఠశాలలో ఒక పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వినాయక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి, తెలంగాణ వచ్చిన తర్వాతనే పదవులు తీసుకుంటానని శపథం చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కరిపె రవిందర్, కొయ్యాడ శంకర్, నారాయణ రెడ్డి, చంద్రకాంత్, కోడూరి స్వామి, గంగాధర్, బాలన్న, దారం భూమన్న, అంకం రావు పాల్గొన్నారు.

బాల్కొండలో ‘ఉల్లాస్’ పరీక్షలు



అక్షరటుడే, బాల్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ‘అమ్మకు అక్షరమాల-ఉల్లాస్’ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు, నిరక్షరాస్య మహిళలకు పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ గాండ్ల రాజేష్ మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమని, మహిళలు విద్యను అభ్యసించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ హక్కులపై అవగాహన పెంచుకుని స్వయం ఆధారంగా నిలబడగలుగుతారని తెలిపారు. పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణులై తదుపరి చదువులకు అర్హత సాధించాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్, ఐకేపీ ఏపీఎం గంగారాం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇన్‌చార్జి ఏబీఎన్ సుష్మ, నవీన్, సాయన్న, స్వరూ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో మహిళలకు పరీక్షలు

అక్షరటుడే, ఇందూరు : నగరంలోని 1వ డివిజన్ పరిధిలోని ఖానాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు ఉల్లాస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 80మంది మహిళలు పరీక్షలు రాయగా.. పరీక్ష కేంద్రాన్ని సీవో సరిత, 1వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు భోజన్న, డివిజన్ ఇన్‌ఛార్జి దినేష్, డీసీసీ వైస్ ప్రసిడెంట్ కొర్వ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఉత్తీర్ణులైన మహిళలకు 7వ తరగతి పాసైనట్లుగా సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.





కుక్కల బెడద తీరేదెన్నడు ?

అక్షరటుడే,కోటగిరి: మండలంలో వీధి కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు రోడ్లపై తిరగాలంటే భయాందోళన చెందుతున్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న శునకాలు వాహనదారులకు, ప్రజలకు, పిల్లలకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గత కొన్ని నెలలుగా మండల కేంద్రంలోని కాలనీలలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలువురు ఇప్పటికే గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. వెంటనే కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.

దార్ల హనుమాన్ మందిరం ఆవరణలో స్వచ్ఛ భారత్



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని ఆలూరు రోడ్డులోని దార్ల హనుమాన్ మందిరం ఆవరణలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కాటేపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రతివారం ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. బీజేపీ కిసాన్ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు మరికొందరికి స్ఫూర్తినిస్తాయన్నారు. మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 73వ ఆదివారానికి చేరుకుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, సాయి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొగడమీది ప్రశాంత్, రమేష్, మహేష్ అగర్వాల్, సాయి కిరణ్, కొత్తూరు రాజయ్య, ఎం. గణేష్, కుకింగ్ నరేష్, సుంకే నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.